ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



నవంబర్ 3 మంగళవారం 2026 | సంపుటి : 1 | సంచిక : 25 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

TUESDAY NOVEMBER 3 2026 | VOL:1 | ISSUE: 25 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

చెత్తరహిత, ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యం: సీఎం

నగరంలో ఎక్కడా చెత్త కనిపించకూడదు

ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ తప్పనిసరి

నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక ఏర్పాట్లు

సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ కోసం అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు

హైదరాబాద్:భాగ్యనగరాన్ని పరిశుభ్రమైన, ట్రాఫిక్ సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నగరంలో ఎక్కడా చెత్త కనిపించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాల్సిందేనని తేల్చిచెప్పారు.



తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి: అమిత్ షా

తెలంగాణను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చుకుందని ఆరోపణ

'ఆర్‌ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని వ్యాఖ్య

ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని విమర్శ

ఈవీఎంలపై రాహుల్ గాంధీ వైఖరిని ప్రశ్నించిన షా

తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదని, రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకుని 'ఆర్‌ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. రేవంత్ రెడ్డి ద్వారా రాహుల్ గాంధీకి ఈ ట్యాక్స్ వెళుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అనేక రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిందని, ఆ పార్టీ వెంటిలేటర్‌పై ఉందని విమర్శించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్‌ను కాపాడలేరని అన్నారు. తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్ర ముగింపు సభలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.'లోకతంత్ర బచావో – అరాచకత హటావో' నినాదంతో తెలంగాణ బీజేపీ ఈ పాదయాత్రను నిర్వహించింది. బషీర్‌బాగ్‌లోని నిజాం కాలేజీ ఎదురుగా ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమైన యాత్ర అబిడ్స్ మీదుగా మోజంజాహీ మార్కెట్ వరకు సాగింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు బీజేపీ ఇచ్చిన ప్రతివ్యూహంలో భాగంగా జరిగింది. ఈవీఎంలపై



నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సు యాత్ర.. 29న భారీ బహిరంగ సభ

కేటీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ బస్సు యాత్రకు సన్నాహాలు

మేడిగడ్డ నుంచి గోదావరి బేసిన్ వరకు యాత్ర

రైతుల సాగునీటి కష్టాలను ఎండగట్టడమే లక్ష్యం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బస్సుయాత్రకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. నవంబర్ 11 నుంచి 14వ తేదీ మధ్య రెండు రోజుల పాటు కేటీఆర్ బస్సు యాత్ర చేపడతారని తెలిపారు. మేడిగడ్డ నుంచి ప్రారంభమయ్యే ఈ యాత్ర,

(మిగతా 2వ పేజీలో..)



ఓట్ చోరీ జరిగితే రాహుల్, రేవంత్ ఎలా గెలిచారు?: రాంచందర్ రావు

కేరళలో కాంగ్రెస్ విజయాన్ని ప్రస్తావించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

కాంగ్రెస్ అబద్ధాలకు కేరాఫ్‌గా మారిందని విమర్శ

అమిత్ షా హైదరాబాద్ పర్యటనతో ఆరోపణలకు సమాధానం ఇస్తారని వెల్లడి

వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో భాజపాదే అధికారమని ధీమా

ఓట్ చోరీ ఆరోపణలపై భాజపా తెలంగాణ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కాంగ్రెస్‌పై



(మిగతా 2వ పేజీలో..)

ఏపీ రెండు రకాల వైపరీత్యాలతో సతమతమవుతోంది.. తక్షణమే సాయం అందించండి: కేంద్రబృందంతో చంద్రబాబు

అర్నబ్ తుపాను నష్టం అంచనా వేసేందుకు ఏపీలో పర్యటిస్తున్న కేంద్రబృందం

ఒకవైపు కరవు, మరోవైపు తుపానులతో ఏపీ ఇబ్బందులు పడుతోందని వెల్లడి

అర్నబ్ తుపాను కారణంగా రాష్ట్రానికి ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.4,526 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తుపాను నష్టాన్ని అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటిస్తున్న కేంద్ర బృందంతో సోమవారం ఆయన సమావేశమై పరిస్థితిని వివరించారు. ఈ కష్టకాలంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రాష్ట్రాన్ని ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తుపాను సమాచారం అందిన వెంటనే స్పందించి, నష్టాన్ని అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీ), ఆధునిక టెక్నాలజీని సమర్థంగా ఉపయోగించుకోవడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. తుపాను నష్టంపై ప్రాథమిక నివేదికను వెంటనే కేంద్రానికి పంపించాం" అని తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని, ఒకవైపు రాయలసీమలో ఎల్ నినో వంటి తీవ్ర కరవు పరిస్థితులు నెలకొంటే, మరోవైపు కోస్తా ప్రాంతం వరుస తుపానులతో అతలాకుతలమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్నబ్ తుపాను మిగిల్చిన నష్టం నుంచి కోలుకోకముందే 'మురసు' రూపంలో మరో తుపాను ముప్పు పొంచి ఉందని గుర్తుచేశారు.తుపాను ప్రభావంతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని సీఎం వివరించారు. ముఖ్యంగా

(మిగతా 2వ పేజీలో..)



ఓబీసీ గణనపై తీర్మానం చేయండి: సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ

ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్

జనగణనలో ఓబీసీ కులగణనపై తీర్మానం చేయాలని విజ్ఞప్తి

ఆదివాసీల మతానికి ప్రత్యేక కాలమ్ చేర్చాలని సూచన

జాతీయ జనగణనలో ఓబీసీల కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు శాసనసభ, శాసనమండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని

(మిగతా 2వ పేజీలో..)



ఏపీ తీరం వైపు 'మురసు'.. పోర్టుల్లో పెను ప్రమాద హెచ్చరికలు.. దక్షిణ కోస్తాలో రెడ్ అలర్ట్


మురసు' తుపానుతో కోస్తాంధ్ర అలజడి

నిజాంపట్నం, వాడరేవు పోర్టులకు 10వ నంబర్ ప్రమాద హెచ్చరిక

ఒంగోలు సమీపంలో తీరం దాటనున్న తీవ్ర తుపాను

రైళ్లు, విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మురసు' తీవ్ర తుపాను ఆంధ్రప్రదేశ్ తీరం వైపు వేగంగా దూసుకొస్తుండటంతో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. తుపాను తీవ్రతను సూచిస్తూ కోస్తాంధ్రలోని ప్రధాన ఓడరేవుల్లో ప్రమాద హెచ్చరికలను జారీ చేశారు. ముఖ్యంగా, బాపట్ల జిల్లాలోని నిజాంపట్నం, వాడరేవు



ఓడరేవుల్లో

(మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు.. ఫేజ్-2కు రూ.150 కోట్లు

మెట్రో ఫేజ్-2కు రూ.150 కోట్లు మంజూరు

రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయింపు

ఫేజ్-2 అధ్యయనాలు, సర్వేలకు నిధుల వినియోగం

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి పాతబస్తీ వరకు.. మెట్రో రెండో దశకు ఊతం

హైదరాబాద్‌లో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం చూపడంతో

(మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఏపీ రెండు రకాల వైపరీత్యాలతో సతమతమవుతోంది..
తక్షణమే సాయం అందించండి: కేంద్రబృందంతో చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

కొబ్బరి, అరటి తోటలు పూర్తిగా నేలమట్టమయ్యాయని తెలిపారు. కరవును తట్టుకునేందుకు రాయలసీమ రైతులను ఉద్యాన పంటల వైపు ప్రోత్సహిస్తుంటే, ఇప్పుడు ఆ పంటలు కూడా తుపానుల బారిన పడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆక్వా కల్చర్ రంగానికి కూడా భారీ నష్టం వాటిల్లిందని, మత్స్యకారుల పడవలు ధ్వంసమయ్యాయని పేర్కొన్నారు. విద్యుత్, రహదారులు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. గతంలో హుద్ హుద్, తిత్లీ, మొంథా వంటి తుపానులు కూడా రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీశాయని ప్రస్తావించారు.ప్రస్తుతం 7 వేల మంది సిబ్బందితో విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని, సహాయక చర్యలను ఆర్టీజీఎస్ ద్వారానే పర్యవేక్షిస్తున్నామని సీఎం వివరించారు. కేంద్ర బృందం త్వరితగతిన తమ సిఫార్సులను కేంద్రానికి అందించి, రాష్ట్రానికి నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. కేంద్రం అందించే సత్వర సాయం, ఈ కష్టకాలంలో రాష్ట్రానికి ఎంతో ఊరటనిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు.

అమిత్ షాతో భేటీపై సోషల్ మీడియాలో స్పందించిన చిరంజీవి, రామ్ చరణ్



సోమవారం నాడు హైదరాబాదులో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కలిశారు. ఇటీవల సినీ పరిశ్రమను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగంపై వారు హోంమంత్రికి తమ ఆవేదనను తెలియజేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి ఆందోళనను సావధానంగా విన్న అమిత్ షా, ఈ అంశాన్ని తక్షణమే పరిశీలించి కఠినమైన నిబంధనలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీపై చిరంజీవి, రామ్ చరణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు.“గౌరవనీయ హోంమంత్రి అమిత్ షా గారిని కలవడం సంతోషంగా ఉంది. ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగం వల్ల కళాకారుల హక్కులు, గౌరవానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందన్న నా ఆందోళనను ఆయనతో పంచుకున్నాను. ఆయన మా సమస్యను అర్థం చేసుకుని, ఈ అంశాన్ని ప్రభుత్వం వెంటనే పరిశీలిస్తుందని, కఠినమైన నిబంధనలు, శిక్షలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రాతపూర్వకంగా వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. ఈ వ్యవహారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారు సమన్వయం చేస్తారని తెలిపారు. ఆయన హామీకి కృతజ్ఞతలు” అంటే చిరంజీవి ట్వీట్ చేశారు.రామ్ చరణ్ స్పందిస్తూ.. “ఈ రోజు నాన్నగారితో కలిసి హోంమంత్రి అమిత్ షా గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నాను. డీప్‌ఫేక్ వల్ల కళాకారులపై, పరిశ్రమపై పడుతున్న తీవ్ర ప్రభావం గురించి మేం వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించడం ప్రోత్సాహకరంగా ఉంది. ఈ అంశాన్ని ప్రభుత్వం వెంటనే పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన ఇచ్చిన హామీ మాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. మా ఆందోళనను అర్థం చేసుకుని, మద్దతు తెలిపినందుకు ఆయనకు కృతజ్ఞతలు” అని తెలిపారు.

హైదరాబాద్ శివార్లలో అక్రమ బోర్లను టార్గెట్ చేసిన హైడ్రా

హైదరాబాద్, దాని శివారు ప్రాంతాల్లో అక్రమంగా భూగర్భ జలాలను తోడేస్తూ సాగిస్తున్న నీటి వ్యాపారంపై హైడ్రా (HYDRAA) ఉక్కుపాదం మోపుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేసి, నీటిని ట్యాంకర్ల ద్వారా అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం భారీ ఆపరేషన్ చేపట్టింది.ఈ ఆపరేషన్‌లో భాగంగా తెల్లాపూర్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 7 అక్రమ బోర్‌వెల్‌లను పైపులతో సహా తొలగించి, వాటిని పూర్తిగా పూడ్చివేసింది. అలాగే, నీటి నిల్వ కోసం నిర్మించిన 6 భారీ వాటర్ సంపులను కూడా అధికారులు ధ్వంసం చేశారు. నీటి రవాణాకు ఉపయోగిస్తున్న ట్యాంకర్లను సీజ్ చేసి, సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేశారు.భూగర్భ జలాలు అడుగంటిపోకుండా కాపాడటంతో పాటు, స్థానిక ప్రజలకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గత కొంతకాలంగా నీటి ట్యాంకర్లు అతివేగంగా, నిర్లక్ష్యంగా ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, తమ ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని పలు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల వాసులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో హైడ్రా ఈ చర్యలకు ఉపక్రమించింది. హైడ్రా తీసుకుంటున్న చర్యలతో తమకు ప్రాణభయం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెరువులు, కుంటల సమీపంలో జరుగుతున్న అక్రమ నీటి దందాను పూర్తిగా అరికట్టాలని వారు కోరుతున్నారు. అనుమతులు లేని బోర్లపై నిఘా కొనసాగిస్తామని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.



ఓట్ చోరీ జరిగితే రాహుల్, రేవంత్ ఎలా గెలిచారు?: రాంచందర్ రావు

మొదటి పేజీ తరువాయి)

విమర్శలు గుప్పించారు. ఎన్నికల్లో అక్రమాలు జరిగితే రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి ఎలా గెలిచారని ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ప్రభావం ఉంటే కేరళలో కాంగ్రెస్ ఎలా విజయం సాధించిందని నిలదీశారు. కాంగ్రెస్ అబద్ధాలకు కేరాఫ్‌గా మారిందని విమర్శించారు.కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానం చెప్పేందుకే కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌కు వస్తున్నారని రాంచందర్ రావు తెలిపారు. రాజ్యాంగబద్ధ సంస్థలపై ప్రజలకు నమ్మకం పోయేలా చేయడం ప్రమాదకరమన్నారు. అలాంటి పరిస్థితులు దేశంలో అరాచకానికి దారితీస్తాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వైఖరిని ప్రజలకు వివరించేందుకే అమిత్ షా పర్యటన చేపడుతున్నారని చెప్పారు.అమిత్ షా పాదయాత్రకు లక్ష మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉందని రాంచందర్ రావు వెల్లడించారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలకు హైదరాబాద్ వేదికగా అమిత్ షా సమాధానం చెబుతారని అన్నారు. తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో భాజపా కచ్చితంగా అధికారంలోకి వస్తుందని రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీని బలోపేతం చేసేందుకు ప్రజల్లోకి వెళ్తున్నామని తెలిపారు.

నవంబర్ 11 నుంచి కేటీఆర్ బస్సు యాత్ర.. 29న భారీ బహిరంగ సభ

మొదటి పేజీ తరువాయి)

గోదావరి పరీవాహక ప్రాంతంలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల మీదుగా సాగుతుందని వివరించారు. ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిని పరిశీలిస్తూ, రైతుల ఇబ్బందులను ఆధారాలతో ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. మరోవైపు, తెలంగాణ ఉద్యమంలో చారిత్రక ఘట్టమైన దీక్షా దివస్‌ను పురస్కరించుకుని నవంబర్ 29న భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు గంగుల తెలిపారు. 2009లో కేసీఆర్‌ను అరెస్టు చేసిన అలుగునూరు లేదా నుస్తులాపూర్ ప్రాంతంలో ఈ సభను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ సభకు సుమారు 50 వేల మంది ప్రజలను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

ఓబీసీ గణనపై తీర్మానం చేయండి: సీఎం రేవంత్‌కు కవిత బహిరంగ లేఖ

మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఓబీసీ కులగణనతో పాటు, ఆదివాసీల మతాన్ని నమోదు చేసేందుకు కూడా ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని కోరుతూ తీర్మానాలు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా, బీసీలకు వారి జనాభా దామాషా ప్రకారం ప్రయోజనాలు అందడం లేదని కవిత తన లేఖలో పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఓబీసీల జనాభాపై చట్టబద్ధమైన, అధికారిక గణాంకాలు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందని ఆమె అభిప్రాయపడ్డారు. కులాల వారీగా లెక్కలు తేలితేనే వారికి సంక్షేమ ఫలాలు సరిగ్గా అందుతాయని స్పష్టం చేశారు. అదేవిధంగా, ఆదివాసీల ప్రత్యేక జీవనశైలి, సంస్కృతి, ప్రకృతి ఆరాధనను దృష్టిలో ఉంచుకుని జనగణనలో వారి మతాన్ని నమోదు చేయడానికి ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ నుంచి ఇంటింటి జనగణన కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ తీర్మానాలను ఆమోదించాలని కవిత కోరారు.

చెత్తరహిత, ట్రాఫిక్ ఫ్రీ హైదరాబాద్ లక్ష్యం: సీఎం

మొదటి పేజీ తరువాయి)

ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోమవారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నగర పారిశుధ్యం, చెత్త నిర్వహణ, ట్రాఫిక్ సమస్యలపై సీఎం దిశానిర్దేశం చేశారు.

నిర్మాణ వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక చర్యలు

హైదరాబాద్‌లో నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణ వ్యర్థాలను తరలించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపు ప్రక్రియలో ఎక్కడా అంతరాయం లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

శుద్ధి చేసిన నీటినే వినియోగించాలి

గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటి సరఫరాను విస్తరించాలని సీఎం సూచించారు. నిర్మాణ పనులు, పార్కులు, పచ్చదనం నిర్వహణ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీతోపాటు సీఎంసీ, ఎంఎంసీ పరిధుల్లోనూ గ్రీన్ వాటర్ సరఫరాను పెంచాలని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ కష్టాలకు పరిష్కారం చూపాలి

నగరంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సిగ్నళ్ల వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలిచిపోవడంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు సిగ్నల్ ఫ్రీ ట్రాఫిక్ వ్యవస్థపై దృష్టి సారించాలని సూచించారు.

అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లకు ప్రణాళికలు

ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అవసరమైన ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. నగరంలో వాహనాల రాకపోకలు సజావుగా సాగేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు.

తెలంగాణ నుంచి కూడా కాంగ్రెస్‌ను తరిమికొట్టాలి: అమిత్ షా

మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలపైనా అమిత్ షా స్పందించారు. ఈవీఎంల వల్లే ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయన్నది కాంగ్రెస్ వాదన అయితే, తెలంగాణలో కాంగ్రెస్ ఎలా గెలిచిందని ప్రశ్నించారు. కేరళం, హిమాచల్‌ప్రదేశ్‌లో ఆ పార్టీ విజయాలు ఎలా సాధ్యమయ్యాయని నిలదీశారు. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, ఆయన పాలనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవని అన్నారు. మోదీ ఇచ్చిన హామీలు అమలయ్యాయని పేర్కొంటూ, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు మాత్రం అమలుకు నోచుకోవడం లేదని విమర్శించారు.దేశంలోని అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారం కోల్పోతోందని అమిత్ షా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీని కాపాడటం రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.అంతకుముందు సోమవారం మధ్యాహ్నం అమిత్ షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు సహా పలువురు పార్టీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కిషన్‌రెడ్డి, రాంచందర్‌రావుతో పాటు ఎంపీ రఘునందన్‌రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఐటీసీ కాకతీయ హోటల్‌కు చేరుకున్న అమిత్ షా అక్కడ భోజన విరామం తీసుకున్నారు. పార్టీ ముఖ్య నేతలతో పాటు పలువురు ప్రముఖులతోనూ సమావేశమయ్యారు. అనంతరం ప్రారంభమైన పాదయాత్రలో కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, రాంచందర్‌రావు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ పాదయాత్రకు ‘లోకతంత్ర బచావో – అరాచకత హటావో’ (ప్రజాస్వామ్యాన్ని రక్షిద్దాం -- అరాచకవాదాన్ని అంతం చేద్దాం) అనే పేరు పెట్టింది. ఢిల్లీలో నిన్న కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు నిర్వహించిన ‘ఓట్ చోరీ’ వ్యతిరేక ర్యాలీకి ప్రతిగా, ఎస్ఐఆర్‌పై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని బీజేపీ నేతలు ప్రకటించారు. హైదరాబాద్ పాదయాత్రతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ ప్రణాళిక రూపొందించింది.

హైదరాబాద్ మెట్రోకు నిధుల జోరు.. ఫేజ్-2కు రూ.150 కోట్లు

మొదటి పేజీ తరువాయి)

పాటు ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించి నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది. రెండో దశ (ఫేజ్-2) పనుల కోసం రూ.150 కోట్లు, ప్రభుత్వ రుణాల పద్దు కింద మరో రూ.125 కోట్లు కేటాయించింది.నగరంలో పెరుగుతున్న జనాభా, ఐటీ, పారిశ్రామిక రంగాల విస్తరణకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను శివారు ప్రాంతాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. తాజా నిధులతో ఫేజ్-2కు సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనాలు, ప్రాథమిక పనులు, ప్రతిపాదిత కారిడార్ల సర్వేలు వేగవంతం కానున్నాయి.రెండో దశలో శంషాబాద్ విమానాశ్రయం, ఐటీ హబ్ పరిధిలోని రాయదుర్గం-కోకాపేట, పాతబస్తీ పరిధిలోని ఎంజీబీఎస్-చంద్రాయణగుట్టతో పాటు ఇతర శివారు ప్రాంతాలను కలిపే కారిడార్లను ప్రతిపాదించారు. మరోవైపు ప్రభుత్వ రుణాల పద్దు కింద కేటాయించిన రూ.125 కోట్లతో మెట్రో ప్రాజెక్టు నిర్వహణ, ఆర్థిక బకాయిలకు సంబంధించిన అవసరాలను సమతుల్యం చేయాలని భావిస్తున్నారు. ఈ నిధుల కేటాయింపుతో ఫేజ్-2 పనులకు సంబంధించిన తదుపరి చర్యలు ముందుకు సాగనున్నాయి.

ఏపీ తీరం వైపు ‘మురసు’.. పోర్టుల్లో పెను ప్రమాద హెచ్చరికలు.. దక్షిణ కోస్తాలో రెడ్ అలర్ట్

మొదటి పేజీ తరువాయి)

అత్యంత తీవ్రతను సూచించే 10వ నంబర్ ప్రమాద హెచ్చరికను ప్రదర్శించారు. అదేవిధంగా, మచిలీపట్నం పోర్టులో 9వ నంబర్, కృష్ణపట్నం పోర్టులో 8వ నంబర్ సిగ్నల్స్ జారీ చేశారు. విశాఖపట్నం, భీమునిపట్నం, గంగవరం, కాకినాడ, కళింగపట్నం ఓడరేవుల్లో 3వ నంబర్ హెచ్చరికలను కొనసాగిస్తున్నారు.గత 6 గంటలుగా ఈ తుపాను గంటకు 10 కిలోమీటర్ల వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. సోమవారం మధ్యాహ్నం నాటికి ఇది నెల్లూరుకు 100 కి.మీ, కావలికి 120 కి.మీ, ఒంగోలుకు 160 కి.మీ దూరంలో కేంద్రీకృతమై ఉంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, సోమవారం (నవంబర్ 2) అర్ధరాత్రి నుంచి మంగళవారం (నవంబర్ 3) తెల్లవారుజాము మధ్యలో నెల్లూరు-నరసాపురం మధ్య ఒంగోలు సమీపంలో ఈ తీవ్ర తుపాను తీరం దాటే అవకాశం ఉంది. ముఖ్యంగా, ఒంగోలుకు దక్షిణం వైపున ఇది తీరం దాటుతుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గంటకు 120 కిలోమీటర్ల వేగాన్ని కూడా అందుకోవచ్చని అధికారులు హెచ్చరిస్తున్నారు.తుపాను నేపథ్యంలో ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యలు చేపట్టింది. బాపట్ల జిల్లాలో మంగళవారం (నవంబర్ 3) పాఠశాలలు, కళాశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. సూర్యలంక బీచ్‌ను మూసివేసి, పర్యాటకులు, స్థానికులు ఎవరూ అటువైపు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఇదే తరహాలో ఎన్టీఆర్, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లోనూ విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చారు. సహాయక చర్యల కోసం బాపట్లలో 9281413774, గుంటూరులో 9440827526 నంబర్లతో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు.తుపాను ప్రభావంతో పలు రైళ్లు, విమాన సర్వీసులు రద్దయ్యాయి. ముఖ్యంగా విజయవాడ-గూడూరు, తెనాలి-రేపల్లె మార్గాల్లో పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. విజయవాడ, భోగాపురం విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించాల్సిన అనేక విమాన సర్వీసులను కూడా నిలిపివేశారు. కోస్తాంధ్ర, ఉత్తర తమిళనాడు ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిన అధికారులు, లోతట్టు ప్రాంతాలు 1 నుంచి 1.5 మీటర్ల మేర ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

పేదింట వెలిగిన ఇందిరమ్మ ఆశల దీపం!

- **వెలిదండలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన**
- **లబ్ధిదారుడు పుల్లెమల్ల రాములు ఇంటి పనులకు శ్రీకారం.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి ముందడుగు**

గరిడేపల్లి, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):

పేద కుటుంబానికి సొంతింటి కల సాకారమయ్యే దిశగా వెలిదండ గ్రామంలో మరో అడుగు పడింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారుడు పుల్లెమల్ల రాములు నూతన ఇంటి నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ చెన్నగాని సాంబయ్య కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు.

పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ ఇళ్ల భరోసా

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. సొంత ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబానికి ఆత్మగౌరవం, భద్రతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభం కావడం లబ్ధిదారుడి కుటుంబానికి సంతోషకరమైన విషయమని అన్నారు.నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



సహకారంతో వెలిదండ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు నాయకులు వెల్లడించారు. గ్రామ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగించేందుకు కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెన్నగాని రామయ్య, వార్డు సభ్యులు గండు యల్లయ్య, ములకలపల్లి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు పెండెం యల్లయ్య, గండు స్వామి, పిల్లుట్ల అశోక్, పుల్లెమల్ల హరీష్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందికి రూ.15 లక్షల బీమా భరోసా!

- **18 మంది సిబ్బందికి ప్రమాద బీమా.. వార్షిక ప్రీమియం చెల్లించిన సర్పంచ్ బిల్లా యాదగిరి**
- **ప్రమాద సమయంలో సిబ్బంది కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యం**

వేలేరు, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):

గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది సంక్షేమానికి వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న 18 మంది సిబ్బందికి ఒక్కొక్కరికి రూ. 15 లక్షల చొప్పున ప్రమాద బీమా కల్పిస్తూ, తపాలా శాఖ (పోస్టాఫీస్) ద్వారా వార్షిక బీమా ప్రీమియం మొత్తాన్ని చెల్లించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో ప్రజలకు వివిధ సేవలు అందిస్తూ గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ఏదైనా అనుకోని సంఘటన జరిగితే వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు వెల్లడించారు. సిబ్బందికి బీమా భరోసా కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక రక్షణ కల్పించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ అభివృద్ధిలో



సిబ్బంది చేస్తున్న సేవలను అభినందిస్తూ, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.గ్రామపంచాయతీ సిబ్బంది పట్ల సర్పంచ్ తీసుకున్న ఈ చొరవ పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, తపాలా శాఖ అధికారి నవ్య, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు

- **బాధితులకు తక్షణ న్యాయం అందించాలి.. పోలీసు అధికారులకు ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఆదేశం**
- **పోలీస్ గ్రీవెన్స్ డేలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్న జిల్లా ఎస్పీ**

సూర్యాపేట, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):

ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించి, సమస్యలను వేగవంతంగా పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.సోమవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే (ప్రజావాణి) కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడారు. వారి సమస్యలను సావధానంగా విని, సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, వారి సమస్యలను సకాలంలో పరిష్కరించడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ప్రజల రక్షణ కోసం పోలీసు సిబ్బంది నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని



తెలిపారు. ప్రజలు చిన్న చిన్న గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, సమస్యలు తలెత్తినప్పుడు దాడులు, ఘర్షణలకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్టపరిధిలో పరిష్కరించుకోవాలని సూచించారు.ప్రజలకు ఏ సమస్య ఎదురైనా పోలీసు శాఖను సంప్రదించాలని, ప్రజల రక్షణకు, సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి.. కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా!

కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలి.. పెన్షన్ రూ.10 వేలు ఇవ్వాలి

బీఎల్ఓ విధుల నుంచి మినహాయింపు, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్

సూర్యాపేట, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):

అంగన్వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా అంగన్వాడీ ఉద్యోగులు పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. అంగన్వాడీ టీచర్లు, ఆయాలకు కనీస వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని, అదనపు బాధ్యతలుగా అప్పగిస్తున్న బీఎల్ఓ విధులను రద్దు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.అలాగే పెండింగ్‌లో ఉన్న టీఏ, డీఏ బకాయిలను తక్షణమే చెల్లించాలని, పదవీ విరమణ అనంతరం నెలకు రూ.10 వేల



పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఏళ్ల తరబడి అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్న తమకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాలని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు.

భూసేకరణ బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం

అఖిలపక్ష ఐక్యతతో రైతుల హక్కుల కోసం ఉద్యమం -- కౌన్సిలర్ ప్రవీణ్

హుజూర్‌నగర్ ,నవంబర్ 2 (ప్రజా నేస్తం జ్వాల):

వ్యవసాయ కళాశాల నిర్మాణం కోసం భూములు కోల్పోయిన 1041 సర్వే నంబర్ పరిధిలోని బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని 12వ వార్డు కౌన్సిలర్ అమరరాపు ప్రవీణ్ తెలిపారు. రైతులకు నష్టపరిహారంతో పాటు హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లు, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. భూసేకరణలో



జరిగినట్లు రైతులు ఆరోపిస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఈ సమస్యను రాజకీయాలకు అతీతంగా పరిష్కరించేందుకు అన్ని అఖిలపక్ష పార్టీల నాయకులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శీలం శ్రీను నాగమణి, వల్లపు నాగరాజు, నలగొస్థ శ్రీనాథ్ (చంటి) సుజాత, చిట్టిపోతుల రమేష్, భూసేకరణ బాధిత రైతులు పాల్గొన్నారు.

కోతులు, వీధి కుక్కల బెడద నుంచి నేరేడుచర్ల ప్రజలను కాపాడండి!

మున్సిపల్ కమిషనర్‌కు సిపిఐ నాయకుల వినతిపత్రం

నేరేడుచర్ల, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల):



నేరేడుచర్ల పట్టణంలో కోతులు, వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరుగుతోందని, వాటి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో కోతులు, వీధి కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు, గర్భిణులు బయటకు వెళ్లాలంటే భయపడుతున్నారని తెలిపారు.వీధి కుక్కల దాడులతో కరిచే ప్రమాదం ఉండటమే కాకుండా, రేబిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు కూడా ఉందని పేర్కొన్నారు. కోతులు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను చిందరవందర చేయడంతో పాటు మహిళలు, చిన్నారులను భయపెడుతున్నాయని తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని వీధి కుక్కల నియంత్రణకు, కోతుల బెడద నివారణకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించడం వల్ల కోతులు నివాస ప్రాంతాల్లోకి ప్రవేశిస్తున్నాయని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత ఉన్నతాధికారులతో చర్చించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను, సహాయ కార్యదర్శి కొమ్రాజు వెంకట్, సిపిఐ సీనియర్ నాయకుడు బెల్లంకొండ గోవిందు గౌడ్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పరికె భరత్, ఇన్సాఫ్ నాయకుడు ఎస్.కె. సైదా కాసిం, బీసీ హక్కుల సాధన సమితి మండల అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, కొదమగుండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించిన మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి

- **ప్రజావాణిలో బీజేపీ నాయకుల వినతి**

హుజూర్‌నగర్, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):



హుజూర్‌నగర్ పట్టణంలోని సర్వే నంబర్ 281లో అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించేలా ఉద్దేశపూర్వకంగా రెండు నిరభ్యంతర పత్రాలు (NOCలు) జారీ చేసినట్లు ఆరోపిస్తూ, సంబంధిత మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.బీజేపీ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 281లో RSR రికార్డుల ప్రకారం 12.33 ఎకరాల భూమి ఉన్నట్లు పేర్కొంటూ, భూముల రిజిస్ట్రేషన్ వ్యవహారంలో అక్రమాలు జరిగాయని ఆరోపించారు. రికార్డుల్లో ఉన్న భూమికి మించి భూమిని కలిపి చూపడం వల్ల =నా= లెక్కల్లో వ్యత్యాసాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఒకరి భూమిని ప్రొహిబిటెడ్ జాబితాలో ఉంచి, మరికొందరి భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేసేలా మున్సిపల్ కమిషనర్ NOCలు ఇచ్చారని ఆరోపించారు.ఒకే దరఖాస్తుకు రెండు NOCలు ఎందుకు జారీ చేశారు? వాటి ఆధారాలు ఏమిటి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దేవాదాయ భూముల ఆక్రమణలకు ఈ వ్యవహారం కారణమైందన్న ఆరోపణల నేపథ్యంలో, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ వ్యవహారంపై అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే, పార్టీ తరఫున పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని బీజేపీ నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్, జిల్లా నాయకులు బెల్లంకొండ నరేష్, కంటు నాగరాజు, కొప్పెర సాయిరాం, విజయ్, చిలకరాజు సైదులు, ములకలపల్లి నరేష్, సీనియర్ రిపోర్టర్ గొట్టే వెంకట్ యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేనులో రైతుపై అడవి పంది దాడి.. తీవ్ర గాయాలు!

- **పత్తి ఏరుతుండగా ఒక్కసారిగా విరుచుకుపడిన అడవి పంది.. ఆసుపత్రిలో చికిత్స**

కాగజ్‌నగర్, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):



పత్తి చేనులో కుటుంబ సభ్యులతో కలిసి పత్తి ఏరుతున్న రైతుపై అడవి పంది అకస్మాత్తుగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన ఘటన కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది.కాగజ్‌నగర్ మండలం బోడెపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గాండ్ల పోచన్న సోమవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి పత్తి చేనులో పత్తి ఏరుతున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా అక్కడికి వచ్చిన అడవి పంది ఆయనపై దాడి చేసింది. ఈ దాడిలో పోచన్న వీపుపై, కుడి కాలిపై తీవ్ర గాయాలయ్యాయి.అకస్మాత్తుగా జరిగిన ఈ ఘటనతో కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే గాయపడిన పోచన్నను కాగజ్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం పోచన్న ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించినట్లు సమాచారం. పంట పొలాల్లో అడవి జంతువుల సంచారం పెరుగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హనుమకొండ జిల్లాలో మట్టి విక్రయాలకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్, యాప్: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):

హనుమకొండ జిల్లాలో మట్టి (గ్రావెల్) విక్రయాలు, రవాణా ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ మరియు మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు.అక్రమ మట్టి తరలింపులకు చెక్ పెట్టేందుకు ఈ సరికొత్త విధానాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. మట్టి అవసరమైన వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే మైనింగ్ శాఖ పరిశీలించి అనుమతులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ విధానం ద్వారా ఒక ట్రాక్టర్ మట్టికి ప్రభుత్వానికి రూ.700 వరకు నిర్దేశిత రుసుము చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

కాళేశ్వరం నీటిని తీసుకొచ్చే మార్గం చూపిస్తా.. మంత్రి ఉత్తమ్‌కు జగదీశ్‌రెడ్డి సవాల్!

- **కన్నేపల్లి పంప్‌హౌస్‌కు వెళ్దాం.. పంపులు ఆన్ చేసి నీటి తరలింపు సాధ్యమని నిరూపిస్తా**

హుజూర్ నగర్, నవంబర్2, (ప్రజానేస్తం జ్వాల),:



కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీటిని తరలించే అంశంపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తనతో కలిసి కన్నేపల్లి పంప్‌హౌస్ వద్దకు రావాలని, అక్కడి నుంచి పంపులు ఆన్ చేసి నీటిని ఎలా తీసుకురావచ్చో స్వయంగా చూపిస్తానని అన్నారు.ఉమ్మడి నల్గొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎల్లంపల్లి నుంచి కరీంనగర్, వరంగల్ మీదుగా మునగాల మండలంలోని చివరి గ్రామం వరకు నీటిని తరలించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇందుకు పెద్దగా ఖర్చు లేకుండానే నీటిని తీసుకొచ్చే మార్గం ఉందని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టును నిరుపయోగంగా మార్చడం వల్ల తెలంగాణ రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందని జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం ఉన్న ప్రాజెక్టుపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.కాళేశ్వరం ప్రాజెక్టు నీటి తరలింపుపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతున్నది నిజమా? బీఆర్ఎస్ చెబుతున్నది నిజమా? అనేది కన్నేపల్లి పంప్‌హౌస్ వద్దే తేల్చుకుందామని ఆయన సవాల్ విసిరారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు హుజూర్‌నగర్ ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

భీమదేవరపల్లి, నవంబర్ 2 (ప్రజా నేస్తం జ్వాల):



యాసంగి సాగులో వరి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసి నీటి వనరులను ఆదా చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచించారు. విద్యుత్ సరఫరా, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని పంటల ఎంపిక చేసుకోవాలని పిలుపునిచ్చారు.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామంలో సోమవారం రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ క్రిసోలైట్ మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌లో వరికి బదులుగా మినుము, పెసర, బొబ్బర్లు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు.ఆరుతడి పంటల సాగుతో భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గడంతో పాటు విద్యుత్ వినియోగం కూడా తగ్గుతుందని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రైతులు పంటల మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రైతులు తమ పొలాల్లో నీటి లభ్యత, నేల స్వభావం, సాగు పరిస్థితులను పరిశీలించి అనువైన పంటలను ఎంపిక చేసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ యాసంగి సాగులో ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని ఏఈఓ క్రిసోలైట్ పేర్కొన్నారు.

పాఠశాలల్లో వందశాతం విద్యార్థుల హాజరే లక్ష్యం

నెలాఖరు వరకు ప్రత్యేక డ్రైవ్.. డీఈవో సచ్చిదానందచారి

ఆసిఫాబాద్ ,నవంబర్ 2 (ప్రజా నేస్తం జ్వాల):



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరును వందశాతానికి పెంచడమే లక్ష్యంగా ఈ నెలాఖరు వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) సచ్చిదానందచారి తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లాలో 720 ప్రభుత్వ పాఠశాలలు, 15 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, ఒక అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ ఉన్నాయి. వీటిలో మొత్తం 2,135 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, 41,218 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు డీఈవో వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలు ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల హాజరు వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రతి వారం సమీక్ష సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఈవో సూచించారు.

కేరమెరిలో నకిలీ ఎస్టీ ధ్రువీకరణ పత్రాల వ్యవహారం కలకలం!

13 మందిపై ఆరోపణలు.. సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశాలు

కేరమెరి ,నవంబర్ 2 (ప్రజా నేస్తం జ్వాల):



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమెరి మండలంలో నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. బెల్దార్ కమ్యూనిటీకి చెందిన 13 మంది అక్రమంగా నక్కల, నాయకపోడ్ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందినట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా కలెక్టర్ సమగ్ర క్షేత్రస్థాయి విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని కేరమెరి తహశీల్దార్‌ను ఆదేశించారు. ఇందుకు సంబంధించి Rc.No.C3/944/2026 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు నాయకులు తెలిపారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న 13 మందికి సంబంధించిన వివరాలను అధికారులకు అందజేసినట్లు వెల్లడించారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసలైన ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లు అనర్హుల చేతుల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ నాయకులు సేడ్మకి భగవంత్ రావు, ASP మండల అధ్యక్షుడు పంద్రం యశ్వంత్ రావు, నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మూట ఎల్లయ్య, మాధవి భరత్ భూషణ్, అడా ఆనంద్ రావు, అడా రామ్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి!

- **రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి**
- **లారీ, ఆటో, క్యాబ్, పాఠశాల బస్సుల యజమానులకు ఎంవీఐ జిలానీ షేక్ సూచనలు**

కోదాడ, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):



తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులు, రహదారులపై వరద నీరు నిలిచే అవకాశాలు ఉన్నందున వాహనదారులు, డ్రైవర్లు, వాహన యజమానులు అప్రమత్తంగా ఉండాలని కోదాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) జిలానీ షేక్ సూచించారు. కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో రహదారి ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలకు చెందిన లారీ అసోసియేషన్లు, రవాణా సంస్థలు, మోటార్ క్యాబ్ యూనియన్లు, ఆటో యూనియన్లు, పాఠశాల బస్సుల యజమానులు ప్రత్యేక అప్రమత్తత పాటించాలని సూచించారు.

రవాణా వాహనాల యజమానులకు సూచనలు:

భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే సమయంలో అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని లారీ యజమానులు, ట్రాన్స్‌పోర్టర్లకు సూచించారు. ప్రయాణానికి ముందు రహదారుల పరిస్థితులను పరిశీలించాలని, సరుకును సురక్షితంగా అమర్చుకోవాలని తెలిపారు. నీటితో నిండిన, ప్రమాదకరమైన రహదారులపై వాహనాలను నడపవద్దని హెచ్చరించారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లు జాగ్రత్త:

ఆటోలు, మోటార్ క్యాబ్‌లను తక్కువ వేగంతో నడపాలని, ఇతర వాహనాలకు తగినంత దూరం పాటించాలని సూచించారు. వర్షం కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపించని సమయంలో హెడ్‌లైట్లు ఉపయోగించాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

పాఠశాల బస్సుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ:

పాఠశాల బస్సుల యజమానులు విద్యార్థుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంవీఐ సూచించారు. బస్సుల బ్రేకులు, టైర్లు, వైపర్లు, లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయాలని తెలిపారు. వరద నీరు ప్రవహిస్తున్న లేదా ప్రమాదకరంగా ఉన్న రహదారులపై బస్సులను నడపవద్దని, పాఠశాలల మూసివేత, రవాణాకు సంబంధించి జిల్లా యంత్రాంగం జారీ చేసే అధికారిక ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యత:

తుఫాన్ సమయంలో తొందరపాటు ప్రయాణాలకు దూరంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులను గమనిస్తూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని ఎంవీఐ జిలానీ షేక్ విజ్ఞప్తి చేశారు. వాహనదారులు స్వీయ రక్షణతో పాటు ఇతరుల ప్రాణ భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.

ప్రారంభ దశలో కుష్ట వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చు





- **రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ విజయనిర్మల**
- **ఇంటింటా కుష్ట వ్యాధి గుర్తింపు సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలన**

భీమదేవరపల్లి, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):

కుష్ట వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే అంగవైకల్యం ఏర్పడకుండా పూర్తిగా నివారించవచ్చని రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ విజయనిర్మల తెలిపారు. దేశం నుంచి కుష్ట వ్యాధిని 2027 మార్చి 31 నాటికి నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.ఎల్‌సీడీసీ కార్యక్రమంలో భాగంగా సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, భీమదేవరపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇంటింటి కుష్ట వ్యాధి గుర్తింపు సర్వేను రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ విజయనిర్మల, హనుమకొండ అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్మోహన్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరును తనిఖీ చేసి ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం వంగర పీహెచ్‌సీలో ఎల్‌సీడీసీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శరీరంపై స్పర్శజ్ఞానం కోల్పోయిన మొద్దుబారిన మచ్చలు, రాగి రంగులో కనిపించే మచ్చలు ఉన్నట్లయితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆరోగ్య కార్యకర్తలకు చూపించుకోవాలని సూచించారు. అనుమానిత లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.కుష్ట వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలు, భయాలను తొలగించాలని, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా అంగవైకల్యాన్ని నివారించడంతో పాటు ఇతరులకు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని వివరించారు. కుష్ట రహిత సమాజ నిర్మాణానికి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో పాటు ప్రజలందరూ బాధ్యతగా సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రెహమాన్, డాక్టర్ రుబీనా, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాస్, డిప్యూటీ పారామెడికల్ అధికారులు బి. దేవిసింగ్, ఎం. ఎల్లయ్య, ఎన్. రవీందర్, పీహెచ్‌ఎన్ వాణి, వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకే బియ్యం విక్రయించాలి

- **అధిక ధరలకు అమ్మితే చట్టప్రకారం కఠిన చర్యలు**
- **వ్యాపారులకు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరిక**

సూర్యాపేట, నవంబర్ 2 (ప్రజా నేస్తం జ్వాల):

జిల్లాలో బియ్యం విక్రయాలు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే జరగాలని, నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు.సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా హోల్‌సేల్ రైస్ డీలర్లతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో బియ్యం ధరలను నియంత్రించి సామాన్య వినియోగదారులకు సరసమైన ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ డీలర్లు సహకరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయించడం, వినియోగదారుల నుంచి అదనపు సొమ్ము వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.అన్ని బియ్యం విక్రయ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికను వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ధరల విషయంలో పారదర్శకత పాటిస్తూ, వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ డీలర్లు ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే బియ్యం విక్రయిస్తామని, ధరల పట్టికను తమ దుకాణాల్లో తప్పనిసరిగా ప్రదర్శిస్తామని కలెక్టర్‌కు హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ బి. హరి సింగ్, డీఎస్ఓ మోహన్ బాబు, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, సంబంధిత శాఖల సిబ్బంది, జిల్లాలోని రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ రైస్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



మిషన్ భగీరథ ఏజెన్సీలను బ్లాక్‌లిస్టులో పెట్టాలి

- **కార్మికులకు ఎస్ఎస్ఆర్ ప్రకారం వేతనాలు చెల్లించాలి.. ఏఐటీయూసీ డిమాండ్**



ఆసిఫాబాద్ ,నవంబర్ 2 (ప్రజా నేస్తం జ్వాల):

మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు ఎస్ఎస్ఆర్ ప్రకారం వేతనాలు చెల్లించని ఎల్‌అండ్‌ఆర్, ఎవరెస్ట్ తదితర ఏజెన్సీలను తక్షణమే బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ మేరకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మికి కార్మికుల సమస్యలను వివరిస్తూ వినతిపత్రాలు అందజేశారు. మిషన్ భగీరథ కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించడంతో పాటు బోనస్, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందినా లేదా ప్రమాదాలకు గురైనా వారి కుటుంబాలకు అండగా ఉండేందుకు రూ.50 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.కార్మికుల హక్కులను పరిరక్షించి, పెండింగ్ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఉపేందర్ కోరారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు పోర్టల్‌ను వెంటనే పునరుద్ధరించాలి: బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్ రెడ్డి!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల-ప్రతినిధి):

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు పోర్టల్ సాంకేతిక సమస్యలతో నిలిచిపోవడంతో వేలాది మంది పట్టభద్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ ఏనుగుల రాకేష్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం నుంచి పోర్టల్ పనిచేయడం లేదని ఆయన పేర్కొన్నారు.ఓటరు నమోదు ప్రక్రియ గడువు ముగియడానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉందని, సాంకేతిక లోపాలను తక్షణమే పరిష్కరించి పోర్టల్‌ను పునరుద్ధరించాలని ఎన్నికల సంఘాన్ని, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన పట్టభద్రులందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

తుఫాన్ ముప్పు.. సూర్యాపేట జిల్లాకు హై అలర్ట్!

- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు**
- **సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణాలు నిలిపివేయాలని కలెక్టర్ సూచన**
- **గంటకు 80 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం.. అధికారులతో కలెక్టర్ అత్యవసర సమీక్ష**

సూర్యాపేట, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):

బంగాళాఖాతంలో ఏర్పడుతున్న తుఫాన్ ప్రభావం సూర్యాపేట జిల్లాపై పడే అవకాశం ఉందని, ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలతో పాటు గంటకు 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.తుఫాన్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో పాటు క్షేత్రస్థాయి సిబ్బందితో కలెక్టర్ అత్యవసర వెబెక్స్ సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు!

అధికారుల అంచనాల ప్రకారం సోమవారం మధ్యాహ్నం గంటకు 40 నుంచి 50 కిలోమీటర్లు, అర్ధరాత్రి 55 నుంచి 65 కిలోమీటర్లు, మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంటకు 70 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని సమావేశంలో వివరించారు. ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

తుఫాన్ ప్రభావం నేపథ్యంలో ప్రయాణాలు వద్దు!

తుఫాన్ ప్రభావం నేపథ్యంలో సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు ప్రయాణాలు చేయవద్దని కలెక్టర్ సూచించారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, భారీ వాహనాల రాకపోకలను వీలైనంత వరకు నిలిపివేయాలని కోరారు.చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు, బలహీనమైన నిర్మాణాల వద్ద నిలబడవద్దని హెచ్చరించారు. ఇళ్లలోని కిటికీలు, తలుపులు, రూఫ్ షీట్లు, బయట ఉన్న వదులుగా ఉండే వస్తువులను భద్రపరుచుకోవాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

వరద ముప్పు ఉన్న గ్రామాలు, లోతట్టు ప్రాంతాలు, బలహీనమైన భవనాలను ముందుగానే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. గుడిసెలు, తాత్కాలిక షెడ్లలో నివసించే వారిని సురక్షితమైన పక్కా భవనాలకు తరలించాలని సూచించారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.వాగులు, వంకలు, బ్రిడ్జిలు, కాజ్‌వేలపై వరద నీరు ప్రవహిస్తుంటే రాకపోకలను పూర్తిగా నిలిపివేయాలని స్పష్టం చేశారు.

పాఠశాలలకు ముందస్తు ఆదేశాలు

విద్యార్థుల భద్రత దృష్ట్యా సోమవారం మధ్యాహ్న భోజనం అనంతరం పాఠశాలలకు సెలవు ప్రకటించి విద్యార్థులను ఇళ్లకు పంపించాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఉపాధ్యాయులు కూడా ఇళ్లకు వెళ్లాలని



సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను సురక్షితంగా ఇళ్లకు చేర్చాలని, హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు ఆహారం, తాగునీరు, రక్షణ కల్పించాలని ఆదేశించారు.

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఇరిగేషన్, మున్సిపల్, పంచాయతీరాజ్, వైద్య, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. రిజర్వాయర్లు, చెరువులు, కాల్వల నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించాలని, విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.రోడ్లపై చెట్లు కూలినా, వరదల కారణంగా రాకపోకలకు అంతరాయం కలిగినా వెంటనే స్పందించేందుకు జేసీబీలు, ఇసుక బస్తాలు, ఇతర అత్యవసర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.

కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్

తుఫాన్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కీలక శాఖ నుంచి ఒక అధికారిని 24 గంటల పాటు అందుబాటులో ఉంచాలని, సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతి గంటకు పరిస్థితిపై నివేదిక అందించాలని సూచించారు.ఫోన్, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడితే పోలీస్ కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా సమాచారాన్ని జిల్లా కేంద్రానికి చేరవేయాలని తెలిపారు. తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సమీక్షలో పాల్గొన్న అధికారులు

ఈ అత్యవసర సమావేశంలో జిల్లా ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, వెంకటరమణ, డీఈఓ శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ డీడీ శ్రీనివాసరావు, డీఎస్ఓ మోహన్ బాబు, ఆర్టీఓ పురుషోత్తం రెడ్డి, డీఐఈఓ సులోచన రాణి, ఆడిట్ అధికారి శ్యామ్, డీటీడీఓ, ఇరిగేషన్, ఫైర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోహెన్స్ ఫార్మాపై సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలి!

- **ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **మృతుడి కుటుంబానికి రూ.5 కోట్ల పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి**

సూర్యాపేట, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కోహెన్స్ ఫార్మా కంపెనీలో చోటుచేసుకున్న ఉద్యోగి మృతి ఘటనతో పాటు కంపెనీ నిర్వహణ, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ కాలుష్యం, ప్రజల ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావాలపై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తండాల నాయకులతో కలిసి సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కంపెనీలో చోటుచేసుకుంటున్న ప్రమాదాలు, కార్మికుల భద్రత విషయంలో యాజమాన్యం అనుసరిస్తున్న తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కంపెనీ చుట్టుపక్కల నివసిస్తున్న ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పర్యావరణ కాలుష్యం, ఆరోగ్య సమస్యలపై వాస్తవాలను వెలికితీసేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

విచారణ పూర్తయ్యే వరకు కంపెనీ కార్యకలాపాలు నిలిపివేయాలి

విచారణ పూర్తయ్యే వరకు కోహెన్స్ ఫార్మా కంపెనీ కార్యకలాపాలను నిలిపివేయాలని, ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే పరిస్థితులు ఉన్నట్లు తేలితే కంపెనీని మూసివేయాలని లేదా జనావాసాలకు దూరంగా తరలించాలని నాయకులు కోరారు. కంపెనీలో జరిగిన ఘటనకు బాధ్యులైన యాజమాన్యంపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



మృతుడి కుటుంబానికి రూ.5 కోట్ల పరిహారం ఇవ్వాలి

కంపెనీలో మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి రూ. 5 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని, ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించే యాజమాన్యాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అన్నారు.ప్రజల ప్రాణాలు, కార్మికుల భద్రత కంటే కంపెనీ లాభాలకే ప్రాధాన్యత ఇచ్చే ధోరణిని విడనాడాలని నాయకులు సూచించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు, చుట్టుపక్కల ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్ర అఖిల్ కుమార్, సీపీఐ సీనియర్ నాయకులు చామల అశోక్ కుమార్, మాస్ లైన్ నాయకులు పేర్ల నాగయ్య, చక్రు నాయక్, శివరామ్, పీఓడబ్ల్యూ నాయకులు జయమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీఆర్ఎస్ సమరశంఖం!

- **హుజూర్‌నగర్‌లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి నేతృత్వంలో పట్టభద్రుల ఓటరు నమోదు సమీక్ష**
- **ప్రతి పట్టభద్రుడి ఓటు నమోదు చేయించాలి.. పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి దిశానిర్దేశం**
- **సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ యువ నాయకుడు పిల్లుట్ల రఘు**

హుజూర్‌నగర్, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):

ఉమ్మడి నల్గొండ--వరంగల్--ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. అర్హులైన పట్టభద్రులందరినీ ఓటర్లుగా నమోదు చేయించడమే లక్ష్యంగా హుజూర్‌నగర్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.హుజూర్‌నగర్ పట్టణంలోని కోదాడ రోడ్డులో గల లక్ష్మీనరసింహ గార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి, నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై మాజీ మంత్రి దిశానిర్దేశం

హుజూర్‌నగర్ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త ఒంటెద్దు నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని, పట్టభద్రులకు అవసరమైన అవగాహన కల్పించి ఓటు హక్కు పొందేలా కృషి చేయాలని సూచించారు.

బీఆర్ఎస్ శ్రేణుల విస్తృత భాగస్వామ్యం

ఈ సమీక్ష సమావేశంలో హుజూర్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ యువ నాయకుడు పిల్లుట్ల రఘు పాల్గొన్నారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, గ్రామ, క్లస్టర్ ఇన్‌చార్జిలు, యువజన, మహిళా, సోషల్ మీడియా విభాగాల ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



తెలంగాణలో ప్రతి ఎన్నికల్లో జనసేన పోటీ చేస్తుంది

పట్టభద్రులు మార్పు కోరుకుంటున్నారు.. కాంగ్రెస్, బీఆర్ఎస్ హామీలపై ప్రజల్లో నమ్మకం తగ్గింది: జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు

హుజూర్‌నగర్, నవంబర్ 2 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీ బలోపేతంగా ఉందని, ఇకపై రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు తెలిపారు.ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకులు, హుజూర్‌నగర్ నియోజకవర్గ పీఓసీలు గాజనబోయిన సైదులు యాదవ్, షేక్ హాసన్ మియా ఆధ్వర్యంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు మార్పును కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇచ్చే హామీలపై ప్రజల్లో విశ్వాసం తగ్గిందని, ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు చూస్తున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పీఓసీలు అందె శ్రీను, సరికొప్పుల నాగేశ్వరరావు, మండల కోఆర్డినేటర్లు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కలానికి రక్షణ కల్పించాలి.. జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి!

- **నిజాన్ని ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం ప్రజాస్వామ్యానికే ప్రమాదం**

ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా నిలుస్తోంది. సమాజంలో జరిగే అన్యాయాలను వెలుగులోకి తీసుకురావడం, ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడం, అవినీతి అక్రమాలను ప్రశ్నించడం జర్నలిస్టుల బాధ్యత. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తున్నారు.అయితే, నేటి పరిస్థితుల్లో నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, విధులకు ఆటంకాలు కలిగించే ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. అక్రమాలను ప్రశ్నించినందుకు కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం, ప్రజా సమస్యలపై వార్తలు రాసినందుకు భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్య విలువలకే విఘాతం.ఒక జర్నలిస్టుపై జరిగే దాడి.. ఒక్క వ్యక్తిపై దాడి మాత్రమే కాదు, ప్రజల గొంతుకను బలహీనపరిచే చర్య కూడా!జర్నలిస్టులు ఎవరికో వ్యతిరేకంగా పనిచేయడానికి కాదు.. ప్రజల పక్షాన నిలబడి వాస్తవాలను సమాజానికి అందించడానికి పనిచేస్తారు. వార్తల్లో తప్పులు ఉంటే ఆధారాలతో ఖండించవచ్చు. చట్టబద్ధమైన మార్గాల్లో ఫిర్యాదు చేయవచ్చు. కానీ దాడులు చేయడం, బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలి. విధి నిర్వహణలో దాడులకు గురైన వారికి న్యాయం అందించాలి. బాధ్యులపై రాజకీయాలకు అతీతంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఫిర్యాదులపై వేగంగా స్పందించే వ్యవస్థను బలోపేతం చేయాలి.అదే సమయంలో పాత్రికేయులు కూడా వాస్తవ నిర్ధారణ, ఆధారాలు, నైతిక విలువలకు ప్రాధాన్యమిస్తూ బాధ్యతాయుతమైన జర్నలిజాన్ని కొనసాగించాలి. పత్రికా స్వేచ్ఛతో పాటు సామాజిక బాధ్యతను కూడా గౌరవించాలి.కలం స్వేచ్ఛగా సాగాలి.. నిజం నిర్భయంగా పలకాలి.. జర్నలిస్టు భద్రంగా విధులు నిర్వహించాలి.ఒక గొంతును అణచివేస్తే ప్రశ్నలు ఆగిపోవు. కానీ ప్రశ్నించే హక్కుకు రక్షణ లేకపోతే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. జర్నలిస్టులపై దాడులను ముక్తకంఠంతో ఖండిద్దాం. స్వేచ్ఛాయుతమైన, బాధ్యతాయుతమైన పాత్రికేయానికి అండగా నిలుద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములమవుదాం.నిజం రాసే చేతులకు సంకెళ్లు కాదు.. రక్షణ కల్పించాలి!

ములుగు సీఎంఆర్ కేసులో సంచలనం: ఏడుగురు రైస్ మిల్లర్లను నాలుగు రోజుల సీఐడీ కస్టడీకి అనుమతించిన కోర్టు!

ములుగు, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):



ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) అక్రమాల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అక్రమాల ఆరోపణలపై అక్టోబర్ 25న అరెస్టయి పరకాల సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న ఏడుగురు రైస్ మిల్లర్లను నాలుగు రోజుల పాటు సీఐడీ కస్టడీకి అప్పగిస్తూ ములుగు న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వ అనుమతితో సన్న వడ్లు తీసుకుని దొడ్డు బియ్యం అప్పగించే ప్రక్రియలో, నిబంధనలకు విరుద్ధంగా పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి దొడ్డు బియ్యాన్ని అక్రమంగా దిగుమతి చేసుకున్నట్లు సీఐడీ అధికారులు పక్కా ఆధారాలు సేకరించినట్లు సమాచారం. కస్టడీ విచారణలో మరిన్ని కీలక వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

జాతీయ యువజన పార్లమెంట్‌కు కేయూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి విష్ణ్నిష్ ఎంపిక!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):



హనుమకొండ సుబేదారిలోని కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన బీఏ విద్యార్థి విష్ణ్నిష్ ప్రతిష్టాత్మక జిల్లా స్థాయి యువజన పార్లమెంట్‌కు ఎంపికయ్యారు. 'మై భారత్--వరంగల్' ఆధ్వర్యంలో వాగ్దేవి కళాశాలలో నిర్వహించిన పోటీలలో ఆయన అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ ఘనత సాధించారు.త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి యువజన పార్లమెంట్‌లో ఆయన జిల్లా తరఫున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి సోమవారం విష్ణ్నిష్‌కు ప్రశంసాపత్రం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి వరంగల్ గర్ల్స్-1 టీజీఎంఆర్జేసీ పాఠశాలకు 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' హోదా!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల– ప్రతినిధి):



ఉమ్మడి వరంగల్ గర్ల్స్-1 టీజీఎంఆర్జేసీ (TGMRJC) పాఠశాలకు ప్రభుత్వం ప్రతిష్టాత్మక 'స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్' హోదాను కల్పించింది. ఈ ప్రత్యేక హోదాను డీఐవో కే. దామోదర్‌రెడ్డి, ఆర్ఎల్‌సీ జంగా సంతోష్ లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాలలో కల్పించిన విద్యా వసతులు, నిరంతర నిర్వహణ తీరును పరిశీలించిన దామోదర్‌రెడ్డి.. పాఠశాల క్రమశిక్షణ, సిబ్బంది బృంద పనితీరును ప్రత్యేకంగా కొనియాడారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల విద్యాసంస్థలకు ఈ పాఠశాల ఆదర్శంగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

జనవరి 2027 చివరి నాటికి గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఎన్నికలు: క్లబ్ ప్రతినిధుల వెల్లడి!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బైలాకు చట్టబద్ధత కల్పించే ప్రక్రియ వేగవంతమైంది. బైలా సవరణల నిమిత్తం ఏర్పాటైన కమిటీ ఈ నెల 25వ తేదీలోగా తమ సమగ్ర నివేదికను సమర్పించాలని క్లబ్ ప్రతినిధులు కోరారు. సదరు నివేదిక ఆధారంగా జనరల్ బాడీ సమావేశంలో ఆమోదం తెలిపి, బైలా సవరణలు మరియు అధికారిక రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం సభ్యత్వాల నమోదు, అర్హులైన జర్నలిస్టుల దరఖాస్తుల స్క్రూటినీ పూర్తి చేసి, జనవరి 2027 చివరి నాటికి పారదర్శకంగా నూతన పాలకవర్గ ఎన్నికలను నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

హనుమకొండ జిల్లా ప్రజావాణికి పోటెత్తిన దరఖాస్తులు: 232 అర్జీలు స్వీకరణ!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



హనుమకొండ జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి భారీగా వినతులు అందాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 232 అర్జీలు వచ్చినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ వెల్లడించారు. శాఖల వారీగా వివరాలు పరిశీలిస్తే.. జిల్లా కలెక్టరేట్‌లో 116, ఆర్డీవో కార్యాలయాల్లో 21, వివిధ మండల పరిషత్ (ఎంపీడీవో) కార్యాలయాల్లో 95 అర్జీలను స్వీకరించారు. ప్రజలు అందించిన ప్రతి దరఖాస్తును బాధ్యతాయుతంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా సత్వర చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఉర్సు రంగలీల మైదానంలో నరకాసుర వధకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కమిషనర్ వెంకన్న!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



దీపావళి పండుగను పురస్కరించుకుని వరంగల్ ఉర్సు రంగలీల మైదానంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించే 'నరకాసుర వధ' వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జీడబ్ల్యూఎంసీ (GWMC) కమిషనర్ తి. వెంకన్న అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకలకు వేలాదిగా తరలివచ్చే భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బలమైన బారికేడ్లు, విస్తృత లైటింగ్, నిరంతర పారిశుద్ధ్యం మరియు తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా వాకీటాకీలను వినియోగిస్తూ సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

జీడబ్ల్యూఎంసీ ఇన్‌ఛార్జ్ అదనపు కమిషనర్‌గా సమ్మయ్య బాధ్యతల స్వీకరణ!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) ఇన్‌ఛార్జ్ అదనపు కమిషనర్‌గా సీనియర్ అధికారి సమ్మయ్య నియమితులయ్యారు. అదనపు కమిషనర్ జోనా పదవీ విరమణ చేయడంతో ఖాళీ అయిన ఆ స్థానంలో సమ్మయ్యకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సమ్మయ్య సోమవారం కార్పొరేషన్ కమిషనర్ తి. వెంకన్నను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.. నగర పాలక సంస్థ పరిధిలోని అభివృద్ధి పనులు, పౌర సేవల నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

ఐడీబీఐ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి: హనుమకొండలో ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



ఐడీబీఐ (IDBI) బ్యాంకులో కేంద్ర ప్రభుత్వానికి, ఎల్ఐసీకి ఉన్న 66.72 శాతం మెజారిటీ వాటాను విక్రయించే ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ICEU) ఆధ్వర్యంలో ఎల్ఐసీ ఉద్యోగులు కదం తొక్కారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ డివిజన్ ప్రధాన ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు లంచ్ అవర్ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఐడీబీఐ ఉద్యోగులు చేపడుతున్న సమ్మెకు వారు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు.ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రైవేటీకరణ విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఐసీఈయూ అధ్యక్షుడు బి. శ్రీహరి డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ రంగాన్ని, ప్రజల పొదుపు సొమ్మును కాపాడుకునేందుకు ఉద్యోగ సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఎల్ఐసీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో రూ.545 కోట్ల సీలింగ్ భూముల వ్యవహారం!

- **బంధువుల పేర్లతో భూ బదలాయింపులు జరిగాయంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు**
- **మూడు రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆర్డీవోకు కలెక్టర్ ఆదేశాలు.. ఇరుపక్షాలకు విచారణకు హాజరుకావాలని సూచన**



సూర్యాపేట ,నవంబర్ 2 (ప్రజా నేస్తం జ్వాల):

హుజూర్‌నగర్ పట్టణంలో సీలింగ్ భూముల అక్రమ బదలాయింపుల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. బంధువుల పేర్లతో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని, సీలింగ్ చట్ట నిబంధనలకు విరుద్ధంగా భూముల బదలాయింపులు జరిగినట్లు ఆరోపిస్తూ ఊట్కూరు శ్రీరామచంద్రమూర్తి సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌కు ప్రజావాణిలో ఆధారాలతో కూడిన ఫిర్యాదు అందజేశారు.హుజూర్‌నగర్‌కు చెందిన కల్వకొలను వెంకట సత్యనారాయణ వరప్రసాద్, కల్వకొలను వెంకట సుధాకర్ శాస్త్రి తదితరులకు సంబంధించిన భూముల వ్యవహారంలో సీలింగ్ చట్ట ఉల్లంఘనలు జరిగాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు 151 ఎకరాల భూమి, మరో 6 వేల చదరపు గజాల స్థలం కలిపి మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ.545 కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదుదారు ఆరోపించారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు.. ఆర్డీవోకు కీలక ఆదేశాలు

ఫిర్యాదుపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, హుజూర్‌నగర్ ఆర్డీవోకు మూడు రోజుల్లోగా పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు ఫిర్యాదుదారు తెలిపారు. అలాగే ఇరుపక్షాలకు విచారణ నిమిత్తం హియరింగ్ షెడ్యూల్ ఏర్పాటు చేయాలని సూచించినట్లు వెల్లడించారు.

సీలింగ్ చట్ట ఉల్లంఘన జరిగిందని ఆరోపణలు

భూ సంస్కరణల చట్టం-1973కు సంబంధించి సీసీ నంబర్ 3963/1975లో తప్పుడు డిక్లరేషన్ సమర్పించి ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. అప్పట్లో మైనర్‌గా ఉన్న కుమారుడి పేరున 42 ఎకరాల 14 కుంటల భూమి, మైనర్ కుమార్తె పేరున 35 ఎకరాలకు పైగా భూమిని గిఫ్ట్ సెటిల్మెంట్ రూపంలో బదలాయించినట్లు పేర్కొన్నారు. సీలింగ్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా జరిగినట్లు భావిస్తున్న ఈ బదలాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.అలాగే సర్వే నంబర్లు 263, 928, 806, 112లలో మొత్తం 12 ఎకరాల 25 గుంటల భూమిని ప్రభుత్వానికి అప్పగించినప్పటికీ, రెవెన్యూ రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయలేదని, సీలింగ్ పట్టా సర్టిఫికెట్లు జారీ చేయలేదని ఆరోపించారు. శాశ్వత రక్షిత కౌలుదారులకు 38-ఈ సర్టిఫికెట్లు జారీ చేయకపోవడం, సీలింగ్ పరిమితికి మించి ఉన్న భూములపై జరిగిన లావాదేవీలను కూడా పరిశీలించాలని ఫిర్యాదులో కోరారు.

బంధువుల పేర్లతో భూముల బదలాయింపుల ఆరోపణలు

కొమ్ముబట్ల సత్యనారాయణ, కొమ్ముబట్ల వెంకటేశ్వర్లు, అమరవాది లక్ష్మీనరసయ్య, కొమ్ముబట్ల కృష్ణమూర్తి తదితరుల పేర్లపై కోట్ల విలువైన భూములు లోపాయికారీగా బదలాయించినట్లు శ్రీరామచంద్రమూర్తి ఆరోపించారు. ఆయా భూములకు సంబంధించిన సర్వే నంబర్లు, సీసీ నంబర్లు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.నాగార్జునసాగర్ కాలువల నిర్మాణంలో భూములు కోల్పోయినట్లు పేర్కొన్న సర్వే నంబర్ 134లోని భూముల వ్యవహారం, బలహీన వర్గాల గుడిసెల తొలగింపు, ప్లాట్లుగా ఏర్పాటు చేసి విక్రయించినట్లు వచ్చిన ఆరోపణలపైనా విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. పబ్లిక్ క్లబ్ అసోసియేషన్ దారికి సంబంధించిన ఖాళీ స్థలాన్ని కూడా పరిశీలించాలని కోరారు.



ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేయాలి

అక్రమ బదలాయింపులు జరిగినట్లు విచారణలో తేలితే సంబంధిత రిజిస్ట్రేషన్లను చట్ట ప్రకారం రద్దు చేసి, ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలని శ్రీరామచంద్రమూర్తి కోరారు. భూమిలేని వ్యవసాయ కూలీలకు, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలుగా పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్రమాలకు పాల్పడినట్లు తేలిన వారిపై చట్ట ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు.కాగా, ఈ వ్యవహారంపై కలెక్టర్ ఆర్డీవోకు నివేదిక సమర్పించాలని ఆదేశించడం, ఇరుపక్షాల వాదనలు వినేందుకు విచారణకు ఏర్పాట్లు చేయాలని సూచించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రెవెన్యూ రికార్డుల పరిశీలన, అధికారుల విచారణ అనంతరం ఈ భూముల అసలు హక్కులు, బదలాయింపుల చట్టబద్ధతపై స్పష్టత రానుంది.

విద్యార్థులకు ఉచితంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ శిక్షణ: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



రాష్ట్రంలోని ఇంజినీరింగ్ విద్యార్థులకు భవిష్యత్ సాంకేతికతలపై పట్టు సాధించేలా తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (TASK), ప్రముఖ టెక్ దిగ్గజం అమెజాన్ వెబ్ సర్వీసెస్ (AWS) సంయుక్త భాగస్వామ్యంతో రాష్ట్రవ్యాప్తంగా 643 టాస్క్ అనుబంధ కళాశాలల్లోని లక్ష మంది విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), క్లౌడ్ కంప్యూటింగ్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.ఈ ఒప్పందం ద్వారా కోర్సుల్లో చేరిన విద్యార్థులు 'ఔజో స్కిల్ బిల్డర్' వేదికగా అందుబాటులో ఉన్న 900కు పైగా డిజిటల్ కోర్సులను ఏడాది పాటు ఉచితంగా అభ్యసించవచ్చని మంత్రి పేర్కొన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రముఖ ఐటీ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా జాబ్ మేళాలు సైతం నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు

ఆర్ఎస్ఈటీఐ ఉచిత స్వయం ఉపాధి శిక్షణను యువత సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్!



హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తంజ్వాల):

హనుమకొండ జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (RSETI) ద్వారా 64 రకాల స్వయం ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో కలిసి ఆర్ఎస్ఈటీఐ శిక్షణా కార్యక్రమాల గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాలు, మండల కేంద్రాలు, ప్రధాన కూడళ్లలో విస్తృతంగా పోస్టర్లను ప్రదర్శించి నిరుద్యోగ యువతకు ఈ కోర్సులు, అర్హతలు, దరఖాస్తు చేసుకునే విధానంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. శిక్షణ అనంతరం బ్యాంకుల ద్వారా స్వయం ఉపాధి రుణాలు పొంది యువత ఆర్థికంగా నిలదొక్కుకునేలా మార్గదర్శనం చేయాలని సూచించారు.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతం చేయండి: ఆర్ అండ్ బీ అధికారులకు మంత్రి కోమటిరెడ్డి ఆదేశం!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల- ప్రతినిధి):



రాష్ట్ర రాజధాని హైదరాబాద్ సచివాలయంలో రోడ్లు భవనాల శాఖ (R&B) ఉన్నతాధికారులతో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వరంగల్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు అల్వాల్ టిమ్స్ (TIMS) ఆసుపత్రి భవన నిర్మాణ పనుల పురోగతిని ఆయన నిశితంగా సమీక్షించారు.ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఈ రెండు భారీ ఆసుపత్రుల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేసి, ఈ ఏడాదిలోనే పూర్తి చేసి ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రధాన రహదారుల అభివృద్ధి, మరమ్మతులు, ఇతర మౌలిక వసతుల కల్పన పనుల పురోగతిపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.

హెచ్ఐవీ నియంత్రణలో విశేష ప్రతిభ: వరంగల్ జిల్లాకు జాతీయ స్థాయిలో 'సురక్షిత జిల్లా' హోదా!

హనుమకొండ, నవంబర్ 02 (ప్రజానేస్తం జ్వాల):



హెచ్ఐవీ (HIV) వ్యాధి నివారణ, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వరంగల్ జిల్లా అత్యుత్తమ ఫలితాలు సాధించి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును దక్కించుకుంది. జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (చీఫ్ జూ) నిర్దేశించిన కఠిన ప్రమాణాలు, వార్షిక లక్ష్యాలను విజయవంతంగా చేరుకోవడంతో వరంగల్ జిల్లాకు ప్రతిష్టాత్మక 'సురక్షిత జిల్లా' హోదా లభించింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించిన క్లినికల్ సమీక్షా సమావేశంలో ఈ ఘనతకు కృషి చేసిన అధికారులను ఘనంగా సత్కరించారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి. రాజిరెడ్డి, ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, సహాయోగి ప్రతినిధి మంజులను కలెక్టర్ శాలువాలతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇదే స్ఫూర్తితో ప్రజా వైద్య రంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.